ఆర్‌ఆర్‌ఆర్ రైల్వే లైన్ ప్రాజెక్టు వేగవంతం చేయండి

- లోక్‌సభ స్పీకర్‌కు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీజినల్ రింగ్ రోడ్ (ఆర్‌ఆర్‌ఆర్) రైల్వేలైన్ ప్రాజెక్టును వేగవంతం చేయాలని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. గురువారం ఢిల్లీలో లోక్‌సభ స్పీకర్‌కు చామల వినతిపత్రం అందజేశారు. దేశంలో మొట్టమొదటిసారి ఒఆర్‌ఆర్ చుట్టు రైల్వే లైన్ రూపకల్పన చేయడం మంచి పరిణామామని తెలిపారు. దాదాపు ఎనిమిది జిల్లాలు, 14 మండలాలను కలుపుకుని పోతుందని పేర్కొన్నారు. హైదరాబాద్ చుట్టుముట్టే ప్రాజెక్టు వ్యయం అంచనా దాదాపు రూ.12వేల కోట్లు అని గుర్తు చేశారు. ప్రాజెక్టుకు సంబంధించి ఉత్తర భాగంలో సర్వే పూర్తయిందనీ, దక్షణ భాగం సర్వే జరుగుతోందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు ఆర్థికంగా సహకరించడం, దాన్ని ప్రోత్సహించడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ప్రాంతీయ కనెక్టివిటీని పెరుగుతోందని తెలిపారు. ఐటి హబ్‌లు, ఫార్మాస్యూటికల్ క్లస్టర్లు, లాజిస్టిక్ పార్కులు బాగా అభివృద్ధి చెందుతున్న పట్టణాలను ఆర్‌ఆర్‌ఆర్ కలుపుతున్నదని గుర్తు చేశారు. పారిశ్రామిక వృద్ధిని ప్రోత్సహించేటప్పుడు తెలంగాణ లాజిస్టిక్స్, మొబిలిటీ పర్యావరణ వ్యవస్థకు మైలురాయి కానుందని ఆయన వివరించారు. ఈ ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు 377 నిబంధన మేరకు జోక్యం చేసుకోవాలని స్పీకర్‌ను ఆయన కోరారు.

కుషల్స్ ఫ్యాషన్ జ్యువెలరీ కొత్త కలెక్షన్లు

హైదరాబాద్ : కుషల్స్ ఫ్యాషన్ జ్యువెలరీ వరమహాలక్ష్మీ పండుగ సందర్భంగా 92.5 స్వచ్ఛమైన వెండి, యాంటిక్ ఫినిష్‌తో కూడిన టెంపుల్ జ్యువెలరీ కలెక్షన్‌ను ఆవిష్కరించినట్లు తెలిపింది. ఈ కలెక్షన్ దక్షిణ భారత వారసత్వం, సమకాలీన శైలిని మేళవిస్తూ, లక్ష్మీ దేవి ప్రతిరూపాలు, హంసలు, ఏనుగులు, గంటలు వంటి శుభ చిహ్నాలతో రూపొందించబడిందని పేర్కొంది. నెక్లెస్‌లు, ఝుమ్కాలు, గాజులు, వడ్డాణములు, అరవంకీలు వంటి వివిధ ఆభరణాలు ఈ కలెక్షన్‌లో ఉన్నాయని కుషల్స్ సహ వ్యవస్థాపకుడు మనీష్ గులేచా పేర్కొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

- కాంగ్రెస్ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని కాంగ్రెస్ ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని సిఎల్‌పి కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై మూడు నెలల్లో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలంటూ సుప్రీం కోర్టు మంచి పరిణామామని తెలిపారు. సుప్రీం తీర్పు బిఆర్‌ఎస్ నేతలకు చెంపపెట్టు లాంటిదని చెప్పారు. పార్టీ ఫిరాయింపులపై హరీశ్‌రావు, కేటీఆర్‌కు మాట్లాడే అర్హత లేదని చెప్పారు. గత ఎన్నికల్లో బిఆర్‌ఎస్ పార్టీ 88 సీట్లను గెలుచుకుందని, అయినా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బిఆర్‌ఎస్‌లో చేర్చుకున్నారని విమర్శించారు. బిఆర్‌ఎస్ వారికి మంత్రి పదవి కూడా ఇచ్చిందని గుర్తు చేశారు. పార్టీ ఫిరాయింపులకు కెసిఆర్ ఆద్యుడు అని తెలిపారు. అనర్హత పిటిషన్ స్పీకర్ పరిధిలోని అంశమనీ, ఆయన ఏ నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తోందని చెప్పారు.

చేపల వేటకు వెళ్లి ముగ్గురు గల్లంతు

- ఖమ్మం జిల్లా ఎర్రుపాలెంలోని కట్టలేరులో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం బంజర గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కట్టలేరులో చేపలవేటకు వెళ్లి గురువారం గల్లంతయ్యారు. తహసీల్దార్ ఉషాశారద తెలిపిన వివరాల ప్రకారం.. బంజర గ్రామానికి చెందిన బాదవత్ రాజు (55), భూక్యా కోటి (46), భూక్య సాయి (25) కట్టలేరుకు చేపలు పట్టేందుకు వెళ్లారు. ఎంతకీ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కట్టలేరు వద్దకు వెళ్లి చూడగా ఆచూకీ లభ్యం కాలేదు. దాంతో వారు పోలీసులు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. తహసీల్దార్ ఉషాశారద, మధిర సిఐ మధు, ఎర్రుపాలెం ఎస్ఐ రమేష్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సమాచారంతో ఖమ్మం నుంచి ఎస్డీఎఫ్ఆర్ బృందాలను పిలిపించి సహాయక చర్యలు చేపడుతున్నారు. రాత్రి వరకూ ఆచూకీ లభ్యం కాలేదు.

రెగట్టా పోటీల్లో బిసి గురుకుల విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతీయ స్థాయి టి స్కాన్ యూత్ ఓపెన్ రెగట్టా పోటీల్లో బీసీ గురుకుల విద్యార్థులకు పతకాల సాధించటం పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ గురుకుల విద్యా సంస్థల కార్యదర్శి సైదులు హర్షం వ్యక్తం చేశారు. పతకాలు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు. జాతీయ స్థాయిలో జరిగిన టి స్కాన్ యూత్ ఓపెన్ రెగట్టా పోటీల్లో బిసి గురుకుల విద్యార్థులు బంగారు, వెండి పతకాలు సాధించారు. యాచ్‌క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్ ఓపెన్ రెగట్టా ఆప్టిమిస్ట్ మెయిన్ ఫ్లీట్ విభాగంలో చాంద్రాయణగుట్ట బాలికల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న జె శిరీష వెండి పతకం సాధించగా, మునుగోడు బాలుర పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న వి హనుమంతు క్యాంస పతకం సాధించాడు. కల్వకుర్తి బాలికల పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న ఎ అక్షర జాతీ స్థాయిలో నాలుగో స్థానంలో నిలిచిందని తెలిపారు. బీసీ గురుకుల విద్యార్థులకు చదువుతో పాటు వారిలో నైపుణ్యాలను, ఆసక్తిని గమనించి అనేక అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు బీసీ గురుకుల విద్యాసంస్థ అత్యధిక ప్రాధాన్యతను ఇస్తోందని వివరించారు. ఇందులో భాగంగా బీసీ గురుకుల విద్యార్థులకు యాచ్ క్లబ్ ఆధ్వర్యంలో హుస్సేన్ సాగర్‌లో శిక్షణ ఇస్తున్నామని సైదులు తెలిపారు.

ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి

- రైతాంగం, విద్యావ్యవస్థ, బిసి రిజర్వేషన్లపై కేంద్ర మంత్రులు స్పందించాలి
- ట్రంప్ జోక్యంపై మోడీ పార్లమెంట్‌లో చెప్పాలి : జాన్‌వెస్లీ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రైతాంగం, విద్యావ్యవస్థపై పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ స్పందించాలన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని టిఎన్‌జిఒ భవనంలో గురువారం మీడియా సమావేశంలో జాన్‌వెస్లీ మాట్లాడారు. ఇండియా, పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని ఆపడంలో ట్రంప్ జోక్యం ఉందా లేదా? అనేది పార్లమెంట్‌లో ప్రధాని మోడీ చెప్పాలన్నారు. 42 శాతం బిసి రిజర్వేషన్ల అమలు కోసం రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు, బిజెపి ఎంపీలు ప్రధానిపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. బిజెపి పాలిత రాష్ట్రాలు రాజస్థాన్, గుజరాత్ లాంటి రాష్ట్రాల్లో రిజర్వేషన్లు పెంచుకునే అవకాశం కల్పించినప్పుడు తెలంగాణలో ఎందుకు అవకాశం ఇవ్వరని ప్రశ్నించారు. స్థానిక ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను సిపిఎంగా స్వాగతిస్తున్నామన్నారు. రాష్ట్రంలో సిఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు అనేక హామీలిచ్చారని.. అవి అమలుకు నోచుకోలేదని అన్నారు. గురుకుల పాఠశాలలు, హాస్టళ్లల్లో విద్యార్థులు కలుషిత ఆహారంతో అస్వస్థతకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో కమిటీలు వేసి విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో గ్రామస్థాయిలో సిపిఎం ఆధ్వర్యంలో సమస్యలను అధ్యయనం చేసి ఎక్కడికక్కడా పోరాటాలు చేస్తామని వెల్లడించారు.

రైతుల సబ్సిడీలపై ప్రభుత్వ నిర్లక్ష్యం
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సాగర్

వ్యవసాయ రంగంలో రైతులకు అందించే సబ్సిడీల విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సాగర్ అన్నారు. ఆస్ట్రేలియా లాంటి దేశం నుంచి మన దేశానికి పాలు దిగుమతి చేసుకోవాలంటే లీటరు రూ.30కే ఇస్తామని చెబుతుందంటే.. అక్కడ రైతులకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో సబ్సిడీలు ఇవ్వడం వల్లే సాధ్యమవుతుందని చెప్పారు. కానీ, మన దేశంలో రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేసి రైతాంగానికి పూర్తిస్థాయిలో సబ్సిడీలు అందించి ఆదుకోవాలని కోరారు. యూరియా కొరత లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో 12 వేల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉండగా.. తొమ్మిది వేల టన్నులు మాత్రమే సప్లై చేసి కొరత సృష్టిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర నాయకులు ఆర్.వెంకట్‌రాములు, ఎం.ధర్మానాయక్, జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, కార్యదర్శివర్గ సభ్యులు దేశ్యానాయక్, జిల్లా కమిటీ సభ్యులు శంకర్‌నాయక్, నాగరాజు, మండల కార్యదర్శి సైదులు, సయ్యద్, సైదులు, నిర్మలరాములు, శివకుమార్, బక్కయ్య వెంకటయ్య, ఆంజనేయ రవి ఉన్నారు.

మా ప్రతి అడుగు ప్రజల కోసమే

- ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తమ ప్రభుత్వం వేసే ప్రతి అడుగు తెలంగాణ ప్రజల కోసమేనని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.. గురువారం హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ జనరల్ కార్యాలయ ప్రాంగణంలో రూ.1.5 కోట్లతో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్ (టిజిఐఐసి) నిర్మించిన 'వెయిటింగ్ ఏరియా'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 20 నెలల కాలంలో తీసుకున్న ప్రతి నిర్ణయం ప్రజల కోసమేనని గుర్తు చేశారు. "యూఎస్ కాన్సులేట్‌కు ప్రతిరోజూ మూడు వేల మందికి పైగా సందర్శకులు వస్తుంటారు. వేచి చూసేందుకు సరైన సౌకర్యాలు లేక ఇక్కడికొచ్చే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి ఎక్కడెక్కడ ఏం అవసరమో గుర్తించి అందుకనుగుణంగా అత్యాధునిక వసతులతో కూడిన వెయింటింగ్ ఏరియాను అందుబాటులోకి తీసుకొచ్చాం. కేవలం పారిశ్రామిక, సాంకేతిక రంగాలకే పరిమితం కాకుండా, ప్రజల రోజువారీ జీవితాల్లో మార్పు తెచ్చేందుకు మా ప్రభుత్వం తీసుకుంటున్న చొరవకు ఇది నిదర్శనం' అని శ్రీధర్ బాబు వివరించారు. ఫార్మా, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, ఇవి రంగాల్లో అమెరికా రాష్ట్రానికి అగ్రగామి వ్యాపార భాగస్వామి ఉందని అన్నారు. తెలంగాణ ఐటి ఎగుమతుల్లో 38 శాతం ఉత్తర అమెరికాకు జరుగుతున్నాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నీఫర్ లార్సన్ తదితరులు పాల్గొన్నారు.

జెన్నిఫర్ లార్సన్‌కు మంత్రి వీడ్కోలు

హైదరాబాద్ అమెరికా కాన్సుల్ జనరల్‌గా తన పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న జెన్నిఫర్ లార్సన్‌కు మంత్రి శ్రీధర్ బాబు గురువారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే చేనేత చీరను ఆమెకు బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ, అమెరికా మధ్య సత్సంబంధాలను బలోపేతం చేసేందుకు ఆమె విశేష కృషి చేశారని కొనియాడారు. విద్య, సాంస్కృతిక మార్పిడి, వాణిజ్య రంగాల్లో భాగస్వామ్యాన్ని పెంపొందించడంలో కీలకంగా వ్యవహరించారన్నారు. ఆమె అందించిన సహకారం, దార్శనికతకు రాష్ట్ర ప్రభుత్వం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

ఫేక్ అటెండెన్స్‌పై మంత్రి సీతక్క సీరియస్

- పంచాయతీ కార్యదర్శులపై చర్యలకు రంగం సిద్ధం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పలువురు పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహించకుండా, ఫేక్ అటెండెన్స్ ద్వారా ఉద్యోగ బాధ్యతల్ని నెరవేర్చుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. దీనిపై సీరియస్ అయ్యింది. అలాంటి పంచాయతీ కార్యదర్శులపై చర్యలకు ఉపక్రమించింది. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేసినట్టు తెలుస్తోంది. ప్రస్తుత విధానాల ప్రకారం, పంచాయతీ కార్యదర్శి విధులు నిర్వహిస్తున్న గ్రామం నుంచే మొబైల్ ఫేషియల్ రికగ్నిషన్ యాప్ ద్వారా హాజరు నమోదవ్వాలి. కానీ, కొంతమంది కార్యదర్శులు ఇతరుల సహాయంతోగానీ, తమ మొబైల్ ఫోన్లు మల్టీ పర్పస్ వర్కర్లకు ఇచ్చి, తాము లేకుండానే యాప్ ద్వారా హాజరు నమోదుచేస్తున్నారని అధికారులు గుర్తించారు. ఏకంగా తమ పాస్‌పోర్ట్ ఫొటోలను వాడి హాజరు నమోదు చేసిన ఉదంతాలూ ఇటీవల వెలుగుచూశాయి. కొన్నిచోట్ల ఖాళీ కుర్చీలను ఫోటోలు తీసి అటెండెన్స్ యాప్ లో అప్లోడ్ చేశారు. వారు విధులకు హాజరుకాకుండా కొందరు ఇతరత్రా వ్యాపారాలు, సొంత పనులు చేసుకుంటున్నారనే విషయమూ ప్రభుత్వం దృష్టికొచ్చింది. మరకొందరు విధులకు డుమ్మా కొట్టి పైస్థాయి ప్రభుత్వ కొలువుల కోసం ప్రిపేరు అవుతున్నారనే సమాచారం ప్రభుత్వం వద్ద ఉంది. ఇలా కొందరు చేస్తున్న తప్పుడు పనుల వల్ల మొత్తం వ్యవస్థపై అపవాదు వస్తుందని రెగ్యులర్‌గా విధులకెళ్తున్న పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫేక్ అటెండెన్స్‌తో నెట్టుకొస్తున్న పంచాయతీ కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ విషయం ఆ నోటా, ఈనోటా మంత్రి సీతక్క దృష్టికొచ్చింది. సంబంధిత కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు, డీపీఓలకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్లకు నివేదికలు పంపించి తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నారు. ఫేక్ అటెండెన్స్ చేసిన పంచాయతీ కార్యదర్శులు, పర్యవేక్షించకుండా వదిలేస్తున్న అధికారులపైనా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ జి.సృజన డీపీఓలను ఆదేశించినట్టు తెలుస్తోంది.

రేపటి నుంచి ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు

- 6న స్కూల్ అసిస్టెంట్ల వెబ్‌ఆప్షన్ల నమోదు
- 7న జిహెచ్‌ఎం ప్రమోషన్ల ఉత్తర్వులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో శనివారం నుంచి ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈ నవీన్ నికోలస్ గురువారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. పది రోజుల్లో ఉద్యోగోన్నతుల ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. ఈ నెల ఒకటో తేదీ నాటికి ఉన్న ఖాళీలను పరిగణనలోకి తీసుకుని గెజిటెడ్ హెడ్మాస్టర్ (జిహెచ్‌ఎం) గ్రేడ్-2, స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఎ) పోస్టులకు ఉద్యోగోన్నతుల ప్రక్రియను చేపడతామని వివరించారు. శనివారం జిహెచ్‌ఎం, ఎస్ఎ పోస్టుల ఖాళీల వివరాలతోపాటు ఎస్ఏ, సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జిటి)ల సీనియార్టీ జాబితాను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఈ నెల మూడు, నాలుగు తేదీల్లో సీనియార్టీ జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తామని పేర్కొన్నారు. అభ్యంతరాలను పరిశీలించి స్కూల్ అసిస్టెంట్ తుది సీనియార్టీ జాబితాను ప్రకటిస్తామని వివరించారు. ఈ నెల ఆరున జిహెచ్‌ఎం గ్రేడ్-2 పోస్టులకు ఉద్యోగోన్నతుల కోసం అర్హులైన స్కూల్ అసిస్టెంట్లు వెబ్‌ఆప్షన్లను నమోదు చేయాలని కోరారు. అదే నెల ఏడో తేదీన ఆర్‌జెడిలు జిహెచ్‌ఎం ఉద్యోగోన్నతుల ఉత్తర్వులను విడుదల చేస్తారని తెలిపారు. ఈ నెల ఎనిమిది, తొమ్మిది తేదీల్లో స్కూల్ అసిస్టెంట్, తత్సమాన క్యాడర్ పోస్టుల ఖాళీలను ప్రకటిస్తామని వివరించారు. వాటిపై అభ్యంతరాలను స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఎస్‌జిటిల సీనియార్టీ జాబితాను ప్రకటిస్తామనీ, వాటిపై అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపారు. ఎస్‌జిటిల తుది సీనియార్టీ జాబితాను ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఈ నెల పదో తేదీన స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగోన్నతుల కోసం ఎస్‌జిటిలు వెబ్‌ఆప్షన్లను నమోదు చేయాలని సూచించారు. అదే నెల 11న ఎస్‌జిటిలకు స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగోన్నతులను కల్పిస్తూ డిఇఒలు ఉత్తర్వులను జారీ చేస్తారని వివరించారు.

3,580 ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు!

రాష్ట్రంలో 3,580 మంది ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు లభించే అవకాశమున్నది. రాష్ట్రంలో 900 జిహెచ్‌ఎం గ్రేడ్-2 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు తెలిసింది. జిహెచ్‌ఎం పోస్టులను వందశాతం ఉద్యోగోన్నతుల ద్వారానే భర్తీ చేస్తారు. దీంతో 900 మంది స్కూల్ అసిస్టెంట్లకు జిహెచ్‌ఎం ఉద్యోగోన్నతులు లభిస్తాయి. దీంతో 900 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీ అవుతాయి. అందులో 70 శాతం పోస్టులు ఉద్యోగోన్నతుల ద్వారా, మిగిలిన 30 శాతం పోస్టులను నేరుగా భర్తీ చేయాల్సి ఉంటుంది. దీంతో 900 స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో 70 శాతం అంటే 630 పోస్టులను ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ అవుతాయి. మిగిలిన 30 శాతం అంటే 270 పోస్టులను నేరుగా భర్తీ చేస్తారు. రాష్ట్రంలో రెండు వేల స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులోనూ 70 శాతం పోస్టులే పదోన్నతుల ద్వారా భర్తీ అవుతాయి. అంటే 1,400 మంది ఎస్‌జిటిలకే ఉద్యోగోన్నతులు వస్తాయి. మిగిలిన 30 శాతం పోస్టులు అంటే 600 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను నేరుగా భర్తీ చేస్తారు. ఈ లెక్కన 2,030 స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఎస్‌జిటిలకు ఉద్యోగోన్నతులు లభిస్తాయి. రాష్ట్రంలో 650 వరకు ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని వంద శాతం ఎస్జీటీల ద్వారా భర్తీ చేస్తారు. ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం ఉద్యోగోన్నతి పొందాలంటే ఇంటర్, డిఎడ్ చదివిన ఉపాధ్యాయులే అర్హులు. బిఇడి పూర్తి చేసిన వారికి ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం ఉద్యోగోన్నతి పొందే అవకాశం లేదు.

ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీల భర్తీ ఎట్లా?

రాష్ట్రంలో జిహెచ్‌ఎం ఖాళీలను స్కూల్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతులను కల్పించి భర్తీ చేస్తున్నారు. స్కూల్ అసిస్టెంట్ ఖాళీలను ఎస్‌జిటిలకు ఉద్యోగోన్నతులను కల్పిస్తున్నారు. దీంతో ఉన్నత పాఠశాలల్లో జిహెచ్‌ఎంతోపాటు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ అవుతున్నాయి. దీంతో విద్యార్థులకు సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా ఉంటున్నది. కానీ ప్రాథమిక పాఠశాలల్లో పని చేసే ఎస్‌జిటిలకు స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగోన్నతులు వస్తున్నాయి. ఎస్‌జిటిల ఖాళీలు మాత్రం భర్తీ కావడం లేదు. స్పౌజ్, పరస్పర బదిలీల వల్ల కొన్ని ఎస్‌జిటిల పోస్టులు ఖాళీ అయ్యాయి. ఇప్పుడు 2,680 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ఎస్‌జిటిలకు ఉద్యోగోన్నతులు లభిస్తాయి. దీంతో 2,680 ఎస్జీటీ పోస్టులు ఖాళీలు ఏర్పడబోతున్నాయి. ఉపాధ్యాయ ఖాళీలతో ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారు. కొన్ని ప్రాథమిక పాఠశాలల్లో ఇద్దరు ఉపాధ్యాయులుంటే వారిద్దరూ పదోన్నతులు పొందితే ఆ బడి పరిస్థితి ఏంటన్న ప్రశ్న తలెత్తుతున్నది. అయితే ఉపాధ్యాయుల సర్దుబాటు ద్వారా విద్యార్థులకు న్యాయం చేస్తామని విద్యాశాఖ అధికారులు చెప్తున్నారు.

ఐకెపి విఒఎల సమస్యలను పరిష్కరించండి

- సెర్ప్ సిఇవొకు సిఐటియు వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐకెపి విఒఎల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం(సీఐటీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్‌కు ఆ యూనియన్ బృందం వినతిపత్రం అందజేసింది. కార్యక్రమంలో ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎస్వీ.రమ, కార్యనిర్వాహక అధ్యక్షులు వి.సుధాకర్, ఉపాధ్యక్షులు ఎం.నగేశ్, వి.సుధాకర్, వెంకటయ్య, చంద్రలీల, రాష్ట్ర కార్యదర్శులు రమేశ్, దుర్గయ్య, అరుణ, కోశాధికారి సుమలత, రాష్ట్ర నాయకులు కుమార్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్వీ.రమ, రాజ్‌కుమార్ పలు సమస్యలను సెర్ప్ సిఇఒ దృష్టికి తీసుకెళ్లారు. రూ.20 వేతనం ఇవ్వాలనీ, బకాయిపడ్డ స్త్రీ నిధి ఇన్సెంటివ్‌లను వెంటనే గ్రామ సంఘాలకు చెల్లించాలని విన్నవించారు. ప్రతి గ్రామ సంఘానికీ ట్యాబ్, నెట్ సౌకర్యం కల్పించాలని కోరారు. గ్రామ సంఘాల నుంచి ఐకేపీ వీఓఏలకు రావాల్సిన రూ.మూడు వేల ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు. మూడు నెలలకోసారి విఒఎలను రెన్యూవల్ చేసే పద్ధతికి స్వస్తి చెప్పి రెండేండ్లకోసారి రెన్యూవల్ చేయాలని సూచించారు. అర్హులైన వారిని సీసీలుగా పదోన్నతి కల్పించాలనీ, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సెర్ప్ సిఇఒ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ...త్వరలో ట్యాబ్ అందిస్తామని, నెట్ సౌకర్యం కల్పిస్తామని హామీనిచ్చారు. మిగతా సమస్యలు వారంలోగా పరిష్కరిస్తామనీ, విధానపరమైన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని భరోసానిచ్చారు.

సిగాచిలో పేలుళ్లపై దర్యాప్తులో జాప్యం

- పిల్‌ను విచారించిన హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డిలోని సిగాచి కర్మాగారంలో భారీ పేలుడు ఘటనపై దర్యాప్తు జాప్యం అవుతోందనే ప్రజాహిత వ్యాజ్యంపై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు గురువారం ఆదేశించింది. కర్మాగారంలో భద్రతా నిబంధనలు పాటించడం లేదనీ, బాధిత కార్మికుల కుటుంబాలకు పరిహారం చెల్లింపులో తీవ్ర జాప్యం జరిగిందని పేర్కొంది. ఈ విషయంపై రిటైర్డ్ శాస్త్రవేత్త కె. బాబురావు వేసిన పిల్‌ను చీఫ్ జస్టిస్ ఏకే. సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ గౌస్ డివిజన్ బెంచ్ విచారించింది. ప్రమాదఘట్టంలో మరణించిన కార్మికులందరూ శాశ్వత ఉద్యోగులు కాదనీ, ఎక్కువగా కాంట్రాక్ట్, వలస కార్మికులని పిటిషనర్ అడ్వకేట్ చెప్పారు. కార్మికులందరికీ పరిహారం చెల్లించాలని కోరారు. ప్రమాద ఘటనపై ఉన్నత స్థాయి కమిటీ, నిపుణుల కమిటీ నివేదికల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎదురుచూస్తున్నట్టు ప్రభుత్వ న్యాయవాది చెప్పారు. అయితే, ఈ రెండు కమిటీల ఫలితాలపై దర్యాప్తు ఆధారపడి ఉండబోదని చెప్పారు. ఇప్పటివరకు ఎవరిని అరెస్టు చేయలేదని కూడా వివరించారు. దీనిపై స్పందించిన హైకోర్టు దీన్ని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకమైన వ్యాజ్యంగా భావించవద్దని స్పష్టం చేసింది. మరణించిన కార్మికుల కుటుంబాలకు సహాయం చేయడానికి రాష్ట్రం తన వంతు కృషి చేయాలని చెప్పింది. ఎఫ్ఐఆర్ నమోదు దశ నుంచి, కేసు దర్యాప్తు పురోగతి వరకు వివరాలు అందజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రాణనష్టం ఏ మేరకు జరిగిందీ, కంపెనీని బాధ్యులుగా గుర్తించి నమోదు చేశారా? ప్రమాదం జరిగినప్పుడు ఫ్యాక్టరీలో ఉన్న కార్మికుల సంఖ్య ఎంత?ఎంతమంది మరణించారు? బాధిత కుటుంబాలకు ఏ మేరకు సాయం అందించారు? కార్మికులకు చెల్లించిన పరిహారం వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో ఏడాది 507 మందికి శిక్షణ

- 416 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి వెంటనే ఉపాధి, ఉద్యోగాలు పొందేలా తీర్చిదిద్దేందుకు ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏడాది పూర్తి చేసుకుంది. 17 ప్రాధాన్య రంగాలకు సరిపడే మానవ వనరుల తయారు చేసేందుకు యూనివర్సిటీ లక్ష్యంగా పెట్టుకుంది. తాత్కాలిక క్యాంపస్‌లో నడుస్తున్న యూనివర్సిటీ ఏడాది కాలంలో 507 మందికి శిక్షణ ఇవ్వగా అందులో 416 మంది అభ్యర్థులు (వీరిలో 82 శాతం మంది ఆఫర్లు లెటర్లు అందుకున్నారు.) ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రతి ఏడాది రాష్ట్రంలో లక్ష మంది ఇంజనీరింగ్ పట్టభద్రులు విద్యను పూర్తి చేసుకుంటుండగా వారిలో కేవలం పది శాతం మంది మాత్రమే ఉద్యోగాలు పొందుతున్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రయత్నిస్తున్న యూనివర్సిటీ కార్పొరేట్ కంపెనీలతో ఒప్పందం చేసుకుంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 2 నుంచి ఆరు నెలల కాల వ్యవధి గల సర్టిఫికెట్, డిప్లొమో కోర్సులను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. సింగపూర్‌కు చెందిన ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌తో ఒప్పందం చేసుకుంది. వచ్చే ఏడాది పది వేల మందికి ఉద్యోగాలు కల్పించాలనీ, ముచ్చెర్లలో పూర్తి స్థాయి క్యాంపస్ అందుబాటులోకి వస్తే 30 వేల ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. యూనివర్సిటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో నైపుణ్య శిక్షణా కేంద్రాలను డిసెంబర్ నాటికి ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఎఐ ఆధారిత డిజిటల్ ప్లాట్ ఫామ్‌ను ఏర్పాటు చేయాలని యూనివర్సిటీ నిర్ణయించింది. ఆన్ లైన్ కోర్సులను ప్రవేశపెట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది. నైపుణ్యాధారిత విద్య, వ్యవస్థాపకత అవుట్‌రీచ్ రంగాల్లో ప్రపంచస్థాయి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా స్కిల్ యూనివర్సిటీ రూపుదిద్దుకుంటున్నది.

కేంద్ర ఒబిసి జాబితాలో 40 కులాలను చేర్చాలి

- తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఒబిసి జాబితాలో 40 కులాలను చేర్చాలని తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ గురువారం ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రాష్ట్రానికి సంబంధించిన కేంద్ర ఓబీసీ జాబితాను 2016 లో ప్రకటించిందనీ, అయితే అప్పటికే రాష్ట్ర బిసి జాబితాలో 112 కులాలుండగా, కేంద్రం మాత్రం 90 కులాలతో మాత్రమే జాబితా ప్రకటించిందని తెలిపారు. ఆ తర్వాత రాష్ట్ర జాబితాలో అనాథలను, మరో 17 కులాలను రాష్ట్ర ప్రభుత్వం చేర్చిందని పేర్కొన్నారు. దీంతో రాష్ట్రంలోని బిసి జాబితాలో మొత్తం కులాల సంఖ్య 130కి చేరగా, కేంద్ర జాబితాలో చేర్చాల్సిన కులాల సంఖ్య 40కి చేరిందని తెలిపారు. కేంద్ర జాబితాలో లేని కులాలను చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం 2016 నుండి వివిధ దఫాలుగా కేంద్రాన్ని కోరుతున్నదని గుర్తు చేశారు. 2016 నుంచి 2020 వరకు అప్పటి బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ లేఖలు రాశారని తెలిపారు. 2021 డిసెంబర్‌లో మొత్తం 40 కులాలను కేంద్ర జాబితాలో చేర్చే విషయంలో జాతీయ బిసి కమిషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో విచారణ కూడా జరిగిందని గుర్తు చేశారు. 2023 సెప్టెంబర్ ఐదున జాతీయ బిసి కమిషన్ అధ్యక్షుడు హంసరాజ్ గంగారామ్ ఆహీర్ ఆధ్వర్యంలో మరో మారు న్యూఢిల్లీలో విచారణ చేపట్టారనీ, అయినప్పటికీ ఆ 40 కులాలను కేంద్ర జాబితాలో చేర్చే విషయంలో ప్రభుత్వం తన నిర్ణయాన్ని ప్రకటించలేదని గుర్తు చేశారు. దీంతో కులాలవారు కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థల్లో, ఉద్యోగరంగంలో తమ అవకాశాలను కోల్పోతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఒబిసి జాబితాలో ఆ కులాలను చేర్చాలని బిసి కమిషన్ చైర్మన్ జి నిరంజన్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రి వీరేంద్ర కుమార్‌కు లేఖ రాశారు.

చిరుతను పట్టుకున్నాం

- వన్యప్రాణులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- కనిపిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 040-23231772కు సమాచారమివ్వండి
- అటవీ అధికారులకు ప్రజలు సహకరించాలి : పిసిసిఎఫ్ చీఫ్ డాక్టర్ సి సువర్ణ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మంచిరేవుల టెక్ పార్కు వద్ద సంచరిస్తున్న చిరుతపులిని పట్టుకున్నామని అటవీ దళాల ప్రధాన సంరక్షణాధికారి (పిసిసిఎఫ్) డాక్టర్ సి.సువర్ణ తెలిపారు. రాష్ట్రంలో చిరుతల సంచారం ఎక్కువైందనీ, ప్రజలు అప్రమత్తంగా ఉండటంతోపాటు కనిపిస్తే అటవీ అధికారులకు సమాచారమివ్వాలని సూచించారు. వన్యప్రాణులు కనిపిస్తే వాటిపై దాడి చేయొద్దనీ, టోల్‌ఫ్రీ నెంబర్ 040-23231772 ద్వారా సమాచారాన్ని అటవీ అధికారులకు చేరవేయాలని కోరారు. మీడియా కూడా సహకరించాలనీ, సోషల్‌మీడియా వేదికగా జరిగే ప్రచారాన్ని నిర్ధారించుకోకుండా వేయరాదని విన్నవించారు. గురువారం హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...టెక్ పార్కులో జూలై 7న తొలిసారి చిరుత కనిపించిందనీ, ఏడు కెమెరాలతో ట్రాప్ చేశామని తెలిపారు. మంచిరేవుల వద్ద తమ అధికారులు బోను ఏర్పాటుచేసి బుధవారం రాత్రి పట్టుకున్నారని చెప్పారు. టైగర్ కంటే చిరుత తెలివిగా, యాక్టీవ్‌గా ఉంటుందన్నారు. బంధించిన చిరుత 50 కేజీల బరువు ఉందని, నెహ్రూజూలాజిక్ పార్కులో మెడికల్ చెప్ చేసిన తర్వాత అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్టులో గురువారం వదిలిపెట్టామని తెలిపారు. వన్యప్రాణుల దాడిలో చనిపోయిన వారికి ఇచ్చే పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచామన్నారు. గాయపడిన వారికి వైద్యపరీక్షలు ఉచితంగా చేయిస్తున్నామనీ, వారికి కూడా గాయ తీవ్రతను పట్టి పరిహారం ఇస్తున్నామని చెప్పారు. వాటి దాడిలో పశువులు మరణించినా వాటికి కూడా పరిహారం ఇస్తున్నామని తెలిపారు. పంటనష్టం జరిగితే రూ.7 వేల పరిహారం ఇస్తున్నామన్నారు. ఎవరైనా జంతువులకు హాని కలిగించే పనులు చేస్తే వారిపై కేసులు నమోదవుతాయని హెచ్చరించారు. టైగర్ ప్రొటక్షన్ ఫోర్స్‌కు కేంద్రం 2015లో అనుమతి ఇచ్చి తిరిగి 2017లో ఉపసంహరించుకుందనీ, కేంద్రం ఇచ్చే ఫండ్స్‌లో కోత విధించడంతో రాష్ట్ర ప్రభుత్వం సైతం ముందుకు పోలేదని వివరించారు.

బిఆర్‌ఎస్ ముఖ్య నేతలతో కెసిఆర్ సమావేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గులాబీ అధినేత, మాజీ సిఎం కెసిఆర్‌తో సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో ముఖ్య నేతలు హరీశ్‌రావు, కేటీఆర్, జగదీశ్ రెడ్డితో గురువారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులపై ప్రధానంగా చర్చించినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టులో తుది తీర్పు వెలువడిన నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది. అంతేకాకుండా, నేటితో పి.జస్టిస్ చంద్రఘోష్ కాళేశ్వరం కమిషన్ గడువు ముగిసి.. ప్రభుత్వానికి రిపోర్టు అందించడంతో వారి సమావేశంలో దీనిపై చర్చించినట్టు సమాచారం. కాళేశ్వరం కమిషన్ మేడిగడ్డతో పాటు ఇతర ప్రాజెక్టుల్లో లోపాలకు తామే కారణమని నివేదిక ఇస్తే.. ప్రభుత్వంపై ఎలా కౌంటర్ ఎటాక్ చేయాలనే దానిపై సమాలోచనలు చేసినట్టు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు పార్టీ సన్నద్ధత, అభ్యర్థి ఎంపికపై హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డి, కెటిఆర్ తమ అభిప్రాయాలను కెసిఆర్‌తో పంచుకున్నట్టు తెలుస్తోంది. చివరగా స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీ శ్రేణులను యాక్టివ్ చేయడం, బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై కూడా చర్చించినట్టు సమాచారం.



పిల్లల్లో బూస్టర్ టీకాలతో రోగనిరోధక శక్తి

- డాక్టర్ బాబు ఎస్ మదార్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్

భారతదేశం చిన్న పిల్లల టీకా కవరేజీలో గణనీయ పురోగతి సాధించినప్పటికీ.. 4-6 సంవత్సరాల వయస్సులో డిఫ్తీరియా, టెటనస్, పెర్టుసిస్ (డిటిపి), పోలియో బూస్టర్ టీకాలు తప్పనిసరి అని హైదరాబాద్‌లోని కిమ్స్ కడెల్స్ చీఫ్ నియోనాటాలజిస్ట్ డాక్టర్ బాబు ఎస్ మదార్కర్ తెలిపారు. చిన్న వయస్సులో టీకాల ద్వారా వచ్చే రోగనిరోధక శక్తి కాలక్రమేణా తగ్గుతుందని, పాఠశాల వాతావరణంలో వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. ఈ బూస్టర్ టీకాలు ఒకే షాట్‌లో బహుళ వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తాయన్నారు. "ఇండియన్ నేషనల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ (ఎన్ఐపి) ప్రకారం.. 6, 10, 14 వారాలలో డిటిపి, 16-24 నెలల్లో బూస్టర్, 6, 14 వారాలలో పోలియో టీకాలు సిఫార్సు చేయబడ్డాయి. టీకాలు ఒకసారి పని కాదు. ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం నిరంతరం అనుసరించాల్సిన విధానమని, పాఠశాల ప్రారంభానికి ముందు పిల్లలు పూర్తి రక్షణ పొందేలా చూడాలి." అని డాక్టర్ మదార్కర్ సూచించారు.

మలబార్ గోల్డ్‌లో ఆఫర్లు

హైదరాబాద్ : ప్రముఖ అభరణాల రిటైల్ చెయిన్ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ వరలక్ష్మీ వ్రతం సందర్భంగా పలు ఆఫర్లను ప్రకటించింది. బంగారం, అన్‌కట్, రత్నాలు, ఆభరణాల తరుగు చార్జీలపై 30 శాతం వరకు తగ్గింపును ఇస్తున్నట్లు తెలిపింది. వజ్రాల విలువపై 30 శాతం వరకు డిస్కౌంట్‌ను ఆఫర్ చేస్తోన్నట్లు తెలిపింది. ఈ ఆఫర్లు ఆగస్టు ఎనిమిది వరకు అందుబాటులో ఉంటాయని పేర్కొంది. వినియోగదారులు తమ పాతబంగారం, వజ్రాలు మార్పిడి చేసుకున్నప్పుడు నూరు శాతం విలువను అందించనున్నట్లు తెలిపింది.



హైదరాబాద్‌లో బ్రిగేడ్ గ్రూప్ కొత్త లగ్జరీ ప్రాజెక్టులు

హైదరాబాద్ : ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ బ్రిగేడ్ గ్రూప్ హైదరాబాద్‌లో రెండు కొత్త ప్రాజెక్టులను చేపడుతున్నట్లు వెల్లడించింది. మోతీనగర్‌లో బ్రిగేడ్ సిటాడెల్ 2, సిటాడెల్ 3 రెసిడెన్షియల్ ప్రాజెక్టుల కోసం జాయింట్ డెవలప్‌మెంట్ ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు వెల్లడించింది. సది ఎకరాల్లో పది లక్షల చదరపు అడుగులతో, రూ.970 కోట్ల ఆదాయ సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టులు 405 లగ్జరీ 3, 4 బెడ్‌రూంల అపార్ట్‌మెంట్‌లను కలిగి ఉంటాయని తెలిపింది. "అధిక నాణ్యత, ప్రీమియం జీవన అనుభవాలతో హైదరాబాద్ స్కైలైన్‌ను మార్చే స్థిరమైన సముదాయాలను సృష్టించడం మా లక్ష్యం," అని బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమం మైసూర్ తెలిపారు.

హైదరాబాద్‌లో కళాధర్ మరో స్టోర్ ప్రారంభం

హైదరాబాద్ : వస్త్ర రిటైల్ సంస్థ కళాధర్ నగరంలోని కొత్తపేటలో మరో స్టోర్‌ను ప్రారంభించింది. రెండు నెలల్లో ఇది రెండవ స్టోర్ అని.. ఇక్కడ పూర్తిగా రెడీమేడ్ ఎథ్నిక్ ఫ్యాషన్ ఉత్పత్తులు లభిస్తాయని పేర్కొంది. ఆధునిక జీవనశైలికి సరిపోయేలా సంప్రదాయం, స్టైల్‌ను కలిపి, ఎంపిక చేసిన కలెక్షన్లను అందిస్తోంది. రెండో తరం వ్యాపారవేత్త కళాదర్ రచబతుని నాయకత్వంలో హైదరాబాద్, వరంగల్‌లో 10కి పైగా స్టోర్‌లతో పాటు ఆన్‌లైన్‌లోను ఉనికిని కలిగి ఉందని ఆ సంస్థ పేర్కొంది.



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న తమిళ క్యాథలిక్ నాయకులు

నన్స్ అరెస్టు చట్టవిరుద్ధం

- తెలంగాణ తమిళ క్యాథలిక్ సభ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సమాజానికి సేవ చేస్తున్న నన్స్‌ను అరెస్టు చేయడం చట్టవిరుద్ధమని తెలంగాణ తమిళ క్యాథలిక్ సభ తప్పుపట్టింది. ఛత్తీస్ ఘడ్‌లో చట్టవిరుద్ధంగా, అన్యాయంగా ఇద్దరు నన్స్‌ను అరెస్ట్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ క్యాథలిక్ సభ ఆధ్వర్యంలో గురువారం సికింద్రాబాద్‌లో సెయింట్ మేరీ జూనియర్ కాలేజ్ నుంచి సెయింట్ థెరిసా విగ్రహం వరకు శాంతి ర్యాలీ నిర్వహించింది. నాయకులు ఆంద్రూస్ జేవియర్, మోజెస్ దాస్, ఒలంపియన్ అమల్ రాజ్, చార్లెస్ తదితర నాయకులు ర్యాలీలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఒక మతం వారిని లక్ష్యంగా చేసుకుని హింసించడం ప్రజాస్వామ్యంలో తగదని వారన్నారు. దేశంలో సెక్యులర్ విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని గుర్తుచేశారు.

అన్యాక్రాంతమైన భూముల స్వాధీనం

- కంచె ఏర్పాటుకు ఆదేశాలు
- నీటిపారుదల శాఖ సమీక్షలో మంత్రి ఉత్తమ్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా నీటిపారుదల శాఖ భూముల పరిరక్షణకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు. వందల కోట్ల రూపాయల విలువ చేసే భూములు కబ్జాకు గురైన పక్షంలో ఎంత మాత్రం ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఆక్రమణలకు గురైన భూములను యుద్ధ ప్రాతిపదికన స్వాధీనం చేసుకోవడంతోపాటు ఆ భూముల చుట్టూ కంచె ఏర్పాటు చేసేలా చర్యలు చేపటడతామని స్పష్టం చేశారు. నీటిపారుదల శాఖ భూముల పరిరక్షణలో బాగంగా గురువారం మధ్యాహ్నం డాక్టర్ బిఆర్ అంబెద్కర్ సచివాలయంలో హైడ్రా, ఇరిగేషన్ అధికారులతో మంత్రి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, హైడ్రా కమిషనర్ ఎవి రంగనాధ్, ఆర్అండ్ఆర్ కమిషనర్ శివకుమార్‌నాయుడు, ఇఎన్‌సి అఫ్జల్ హుస్సేన్, ఇఎన్‌సి అడ్మిన్ రమేష్ బాబు, వాలంతరి డైరెక్టర్ జనరల్ అనిత, హైడ్రా ఎస్‌పి అశోక్ తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధానంగా హైదరాబాద్‌లోని గండిపేట, రాజేంద్రనగర్ పరిధిలో ఉన్న గండిపేట సమీపంలోని హిమాయత్‌సాగర్, కిస్మత్‌పూర్‌తోపాటు వాలంతరి, టిజిఇఆర్ఎల్‌కు చెందిన 426-30 ఎకరాలకుగాను 131-31ఎకరాలు కబ్జాకు గురైనట్టు గుర్తించినట్టు చెప్పారు. అందులో ఐటిఐఆర్ అధీనంలో ఉన్న 81.26 ఎకరాల అంశం కోర్టు పరిధిలో ఉందన్నారు. మిగతా 50.13 ఎకరాలు ఆక్రమణకు గురైందన్నారు.

కాగా ఈ ఆక్రమణలపై జిల్లా కోర్టులో 20 కేసులు పెండింగ్‌లో ఉండగా, హైకోర్టులో మరో రెండు కేసులు నడుస్తున్నాయని చెప్పారు. భూములను పరిరక్షించడంలో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు ఏర్పడ్డా ఎదుర్కొనేందుకు నీటిపారుదల శాఖ ప్రత్యేక సీనియర్ న్యాయవాదిని నియమించనున్నట్టు ఆయన వెల్లడించారు. కోటానుకోట్ల విలువ చేసే భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు గాను నీటిపారుదల శాఖ హైడ్రా, రెవిన్యూ, ఆర్అండ్ఆర్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నీటిపారుదల శాఖ భూములను సత్వరం గుర్తించాలని ఆయన నీటిపారుదల శాఖాధికారులకు సూచించారు. అంతేగాకుండా నీటిపారుదల క్వార్టర్లలో అక్రమంగా ఆక్రమించుకున్న వారిని తొలగించడంతోపాటు తక్షణమే వాటి సమగ్ర సమాచారం తన ముందుంచాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నీటిపారుదల శాఖకు చెందిన అంగుళం భూమిని కూడా ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. భవిష్యత్‌లోనూ ఆక్రమణలకు చోటు లేకుండా పరిపాలనాపరంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. తద్వారా ఆక్రమణలకు చెక్ పెట్టొచ్చని ఆయన సూచించారు. దానికి తోడు రాష్ట్రవ్యాప్తంగా నీటిపారుదల కాలువల పక్కన ఉన్న భూముల్లో ,ప్రాజెక్టులకు చెందిన భూములలో సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇదే విషయమై ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో నీటిపారుదల శాఖా భూములలో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై చర్చించామన్నారు. సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులకు విద్యుత్‌ను అందించ వచ్చని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

కాంగ్రెస్ సర్కారులో దళితులకు నో కాంట్రాక్ట్

- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వంలో దళితులకు కాంట్రాక్టులు ఇవ్వడం లేదని బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. ఈ మేరకు గురవారం ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. చేవెళ్ల డిక్లరేషన్ అమలులో కాంగ్రెస్ విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్‌సి, ఎస్‌టి, బహుజనులకు తీరని అన్యాయం జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ సిఎం కెసిఆర్ దళిత బంధు పథకంతో వ్యాపార రంగంలో ఆత్మగౌరవంతో నిలబడేలా చేశారనీ, ఎస్‌సి, ఎస్‌టి, బిసి కాంట్రాక్టర్లకు ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఇఎండి) 40 శాతం మినహాయింపునిచ్చారని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి సర్కారు గురుకులాల టెండర్లలో కూడా ఎస్‌సి, ఎస్‌టిలకు ఎలాంటి మినహాయింపులు ఇవ్వలేదని తెలిపారు. దళిత బంధు రూ.12 లక్షలు ఇస్తామని, ప్రభుత్వ ప్రొక్యూర్ మెంట్, కాంట్రాక్టులో 18 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చి మోసగించిందని మండిపడ్డారు. హామీలు అమలు చేయకుండా పాదయాత్రలు చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటు వేయాలి

- రాహుల్ గాంధీ స్పందించాలి : కెటిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటు వేయాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. కొంతమంది ప్రజాప్రతినిధులు అడ్డదారులు తొక్కినంత మాత్రాన ప్రజాస్వామిక వ్యవస్థ నాశనం కాదని నిరూపించిన సుప్రీంకోర్టుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కోర్టులను తప్పుదోవ పట్టించాలన్న కాంగ్రెస్ కుట్రలను ఎదుర్కొని అంతిమంగా సత్యమే గెలిచిందన్నారు. గౌరవప్రద స్పీకర్ పదవిని అడ్డం పెట్టుకుని రాజ్యాంగ వ్యతిరేక ఫిరాయింపుల రాజకీయానికి సుప్రీం తీర్పు చెంపదెబ్బ లాంటిదని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు తీర్పుపై కాంగ్రెస్ ముఖ్య నేత రాహుల్ గాంధీ తన నిజాయితీ, నిబద్ధతను నిరూపించుకోవాలని సూచించారు. పార్టీ మారితే అనర్హత వర్తించాలని పాంచ్ న్యాయ్ సూత్రాన్ని వల్లె వేస్తున్న రాహుల్ సుప్రీంకోర్టు తీర్పుని స్వాగతించాలన్నారు. పార్టీ ఫిరాయింపులపై రాష్ట్రానికో నీతి సూత్రం కాంగ్రెస్ భవిష్యత్ రాజకీయాలకు సరికాదనీ, ఆ విషయంలో కాంగ్రెస్ అధిష్టానం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. సుప్రీం తీర్పుతో రానున్న మూడు నెలల్లో పది నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలకు వస్తాయని భావిస్తున్నామని చెప్పారు. ఉప ఎన్నికలకు బిఆర్ఎస్ సిద్ధంగా ఉందని ప్రకటించారు.

అబాస్‌ను ఉపసంహరించుకోవాలి

- నేడు నల్లబ్యాడ్జీలతో నిరసన
- తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వైద్యారోగ్యశాఖలో ఉద్యోగులందరికి అమలు చేయాలనుకుంటున్న ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టం (అబాస్)ను ఉపసంహరించుకోవాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టియుఎంహెచ్ఇయు - సిఐటియు అనుబంధం) డిమాండ్ చేసింది. శుక్రవారం (ఆగస్టు 1న) ఉద్యోగులందరు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలపాలని యూనియన్ పిలుపునిచ్చింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండి ఫసియుద్దీన్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్ణయించింది.



సమావేశంలో మాట్లాడుతున్న యాద నాయక్

ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాద నాయక్ మాట్లాడుతూ వైద్యారోగ్య రంగంలో పని చేస్తున్న ఉద్యోగులు సమయ సందర్భాలు లేకుండా ప్రతి రోజు 24 గంటలు పని చేస్తున్నారని తెలిపారు. తమ వ్యక్తిగత జీవితాల్లో ముఖ్యమైన సందర్భాల్లో కూడా కుటుంబాలకు దూరంగా గడుపుతున్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్య పథకాలను అమలు చేస్తూ ఆరోగ్య తెలంగాణ సాధన కోసం పాటుపడుతున్నారని తెలిపారు. ఇలాంటి పని చేస్తున్న తమ విషయంలో ఉద్యోగులను, అధికారులను ఎవరిని సంప్రదించకుండా అబాస్ విధానాన్ని తీసుకురావడం సమంజసంగా లేదని తీవ్రంగా ఖండించారు. ఎవరైనా ఉద్యోగులు పని చేయకపోతే ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవచ్చని గుర్తుచేశారు. అంతేగానీ "ఎలుకల బాధకు ఇల్లు తగలబెట్టుకున్నారన్న" చందంగా ఇలాంటి సంస్కరణలతో భవిష్యత్తులో ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందే పరిస్థితి ఉండదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గల ఉప కేంద్రాలు 20-30 కిలోమీటర్ల పరిధిలో ఉండడం వల్ల గ్రామాల్లో మొబైల్ నెట్వర్క్ సమస్య ఉందని తెలిపారు.

సబ్ కేంద్రాల్లో పని చేసే మొత్తం మహిళా ఉద్యోగులకు సరైన సమయంలో హాజరు వేయడం కష్టంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు చేసిన ఈ విధానం వల్ల ఉద్యోగులు చాలా కష్టాలు పడుతున్నారని తెలిపారు. తమ ఫోన్లలో ఉన్న సమాచారం మొత్తం బయటికి వెళ్లి, డబ్బులు పోగొట్టుకొని తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీల్డ్ సిబ్బంది అందరు జాబ్‌చార్ట్‌తో నిమిత్తం లేకుండా ,సమయంతో నిమిత్తం లేకుండా, ఎక్కడ అవసరమనుకుంటే అక్కడ ఏజెన్సీ, మారుమూల గ్రామాల్లో, గూడాల్లో, తండాల్లో పని చేయాల్సి వస్తుందని, వారికి సమయ పాలన ప్రకారం హాజరు వేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.

నేడు జరిగే నిరసన కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా పని చేస్తున్న అన్ని క్యాడర్ల ఉద్యోగులు యూనియన్లు, అసోసియేషన్లకు అతీతంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు భూపాల్, రాష్ట్ర కోశాధికారి ఎ కవిత, ఆఫీస్ బేరర్లు కె బలరాం, వేణుగోపాల్, భూలక్ష్మి, విజయ వర్ధన్ రాజు, సుధాకర్, భాస్కర్, నవీన్ కుమార్, శ్రీనివాస్, యాదయ్య, కిరణ్మయి, ఏడుకొండలు, యాదగిరి, హరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ ఆరోగ్యంలో తెలంగాణ టాప్ : మంత్రి శ్రీధర్ బాబు

- స్టార్ హాస్పిటల్స్, మైగేట్ భాగస్వామ్యం



ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ వైద్య సేవల సంస్థ స్టార్ హాస్పిటల్స్, మైగేట్‌తో కలిసి 'స్టార్ సర్వీసెస్ ఆన్ మైగేట్'ను ప్రారంభించింది. దేశంలోనే మొదటి హాస్పిటల్-కమ్యూనిటీ యాప్ భాగస్వామ్యంగా నిలుస్తుందని స్టార్ హాస్పిటల్ యాజమాన్యం తెలిపింది. ఈ చొరవ గేటెడ్ కమ్యూనిటీలకు అధునాతన వైద్య సేవలను అందిస్తుందని వెల్లడించింది. బుధవారం నానక్‌రామ్‌గూడలోని స్టార్ హాస్పిటల్‌లో దీనిని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు, ఎంఎల్‌ఎ ఆరెకపూడి గాంధీ, మైగేట్ సిబిఒ రోహిత్ జిందాల్ లాంచనంగా ప్రారంభించారు. "ఈ భాగస్వామ్యం ఆరోగ్య సంరక్షణను ఇంటి వద్దకు తీసుకొస్తుంది. తెలంగాణ డిజిటల్ ఆరోగ్యంలో అగ్రగామిగా నిలుస్తుంది," అని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మైగేట్ ద్వారా 1,800 పైగా కమ్యూనిటీలు, 5 లక్షల కుటుంబాలకు 30 పైగా స్పెషాలిటీలలో సేవలు అందుతున్నాయని ఆ సంస్థ పేర్కొంది. వీటిలో స్పెషలిస్ట్ అపాయింట్‌మెంట్‌లు, నివారణ సూచనలు, అత్యవసర స్పందన మార్గదర్శకాలు, శిక్షణ ఉన్నాయని తెలిపింది.

నీరాకేఫ్‌కు రీ టెండర్ వేయాలి : కెజికెఎస్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నీరా కేఫ్‌కు రీ టెండర్ వేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవి రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. టాడి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉన్న నీరా కేఫ్‌కు మే 21న టెండర్ ప్రకటన ఇవ్వగా రెండు టెండర్లు వేశారని తెలిపారు. సాంకేతిక బిడ్‌లో వివరాలు వేయకుండా ఆర్థిక బిడ్‌లోనే వేయడంతో మే 28న కార్య నిర్వాహక కమిటీ రిజెక్ట్ చేసిందని పేర్కొన్నారు. అందుకనే వారికి డీడీలు వాపస్ ఇచ్చి రీ టెండర్‌కు ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన నీరా కేఫ్ టూరిజం శాఖ పరిధిలో ఉందనీ, కల్లుగీత కార్మికులకు కేటాయించిన బడ్జెట్‌తో నిర్మించిన ఆ కేఫ్‌ను టాడి కార్పొరేషన్‌కు అప్పగించాలని కల్లుగీత కార్మిక సంఘంతో పాటు పలు సంఘాలు ఆందోళన చేపట్టాయని గుర్తు చేశారు. బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో టాడి కార్పొరేషన్‌కు దీన్ని అప్పగించారని తెలిపారు. దీనిలో ఆరు కమర్షియల్ షాపులు, ఒక బాంకెట్ హాల్, నీరా స్టాల్, ప్రాసెసింగ్ యూనిట్ ఉన్నాయని పేర్కొన్నారు. వీటిని టెండర్ వేయడం ద్వారా టాడి కార్పొరేషన్‌కు ఏడాదికి సుమారు రూ. కోటికి పైగా ఆదాయం వస్తుందని తెలిపారు. వీటిని గీత కార్మికుల సంక్షేమం కోసం డబ్బును ఖర్చు చేయవచ్చని సూచించారు. అందువల్ల ప్రభుత్వం వెంటనే టెండర్‌కు ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేశారు.

హైకోర్టుకు నలుగురు కొత్త జడ్జిలు

- ప్రమాణస్వీకారం చేయించిన సిజె జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైకోర్టులో కొత్తగా నియమితులైన నలుగురు జడ్జిలు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్, జస్టిస్ రామకృష్ణా రెడ్డి, జస్టిస్ సుద్దాల చలపతిరావు, జస్టిస్ గౌస్ మీరా మొహియుద్దీన్‌తో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ ప్రమాణం చేయించారు. హైకోర్టులో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు న్యాయమూర్తులు, లాయర్లు హాజరయ్యారు. హైకోర్టులో లాయర్లుగా ఉన్న ఈ నలుగురిని జడ్జిలుగా నియమించాలంటూ సుప్రీంకోర్టు కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. దీంతో వారి నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 28న ఆమోదముద్రవేశారు. కాగా తెలంగాణ హైకోర్టులో సంఖ్యా పరంగా చూస్తే మొత్తం 42 మంది జడ్జిలు ఉండాలి. తాజాగా ప్రమాణ స్వీకారం చేసిన జడ్జీలతో కలిపి ప్రస్తుతం వారి సంఖ్య 30కి చేరింది.

సుప్రీం తీర్పు రేవంత్‌రెడ్డికి చెంపపెట్టు

- బిఆర్ఎస్ నాయకులు సోమ భరత్, వివేకానంద

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్యే పార్టీ ఫిరాయింపునకు సంబంధించి సుప్రీం తీర్పు సిఎం రేవంత్‌రెడ్డికి చెంపెట్టులాంటిదని బిఆర్ఎస్ విప్ కెపి వివేకానంద, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సోమ భరత్ చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ స్పీకర్ దగ్గర ఏడాదిన్నరగా పెండింగ్‌లో ఉందని తెలిపారు. మూడు నెలల్లో పిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ పై నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు ఆదేశించడం చరిత్రాత్మకమన్నారు. ఉపఎన్నికలు ఎలా వస్తాయి అధ్యక్షా అని అసెంబ్లీలో రేవంత్ రెడ్డి సుప్రీం కోర్టు ను తప్పు పట్టేలా వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. ఆ తీర్పు మీద ఏ మాత్రం నమ్మకమున్నా పది మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ మారగానే ఎమ్మెల్యేలు, ఎంపిలు సభ్యత్వాన్ని కోల్పోయేలా చట్టం తెస్తామని ఎఐసిసి మేనిఫెస్టోలో చెప్పిందని గుర్తు చేశారు. ఈ విషయంలో ఢిల్లీలో రాహుల్ గాంధీ ది ఓ మాట గల్లీలో రేవంత్‌ది ఇంకో మాటని ఏద్దేవా చేశారు. ద్వంద్వ ప్రమాణాలకు కాంగ్రెస్ చిరునామాగా మార్చిందని ఆగ్రహం చేశారు. ఈ కేసులో ఆపరేషన్ సక్సెస్ పేషెంట్ డెడ్ అనే పదాన్ని సుప్రీంకోర్టు వాడిందని గుర్తు చేశారు.

మైనార్టీలకు మంత్రి పదవి ఏది?

- మాజీ మంత్రి మహమూద్‌అలీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర క్యాబినెట్‌లో మైనార్టీలకు చోటేదని మాజీ హోం మంత్రి మహమూద్ అలీ ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబీ ఎన్నికల సందర్భంగా మైనార్టీలకు ఇచ్చిన వాగ్దానాలను కాంగ్రెస్ విస్మరిస్తోందని విమర్శించారు. మైనార్టీలకు బడ్జెట్‌లో కేటాయిస్తామన్న నిధులు కేటాయించలేదని ఆరోపించారు. మైనార్టీ సబ్ ప్లాన్ తెస్తామని డిక్లరేషన్‌లో చెప్పి, మాట తప్పారని విమర్శించారు. ఇమామ్, మౌజంలకు వేతనాలు పెంచుతామని చెప్పి పెంచలేదన్నారు. వారిని ప్రభుత్వం ఆదాయ ధృవీకరణ పత్రాలు అడుగుతోందని తెలిపారు. మైనార్టీ గురుకులాల్లో సరైన సౌకర్యాలు కల్పించడం లేదని చెప్పారు. ప్రీ ,పోస్టు మెట్రిక్ స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చెయాలని కోరారు. మైనార్టీలకు మరో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డు మాజీ చైర్మెన్ మసియుల్లా ఖాన్ మాట్లాడుతూ రేవంత్ ప్రభుత్వంలో మైనార్టీలకు ఒరిగింది శూన్యమని విమర్శించారు. వక్ఫ్ బిల్లును బిఆర్ఎస్ వ్యతిరేకించిందని గుర్తు చేశారు. 80 లక్షల జనాభా ఉన్న ముస్లింలు కాంగ్రెస్ నిజస్వరూపాన్ని ఇప్పటికే గ్రహించారని గుర్తు చేశారు.

బర్త్‌డేకు పిలిచి యువతిపై లైంగికదాడి!

- యువకుడిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంస్టాగ్రామ్‌లో పరిచయమైన ఓ యువతిని తన పుట్టిన రోజుకు ఇంటికి పిలిచిన ఓ యువకుడు ఆమెపై లైంగికదాడి చేశాడు. ఈ ఘటన హైదరాబాద్ బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సిఐ నరసింహరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఖాజాగూడకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి ఫతేనగర్ డివిజన్‌లోని శోభన కాలనీలో నివసించే సిద్ధారెడ్డి(24) ఇంస్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. నెల రోజుల పరిచయం తర్వాత ఈ నెల 30న తన పుట్టిన రోజు ఉందని ఆ యువతిని ఇంటికి ఆహ్వానించాడు. అక్కడికి వెళ్లిన ఆమెకు బీరు తాగించాడు. ఆ తర్వాత మత్తులో ఉన్న ఆమెపై లైంగికదాడికి ఒడిగట్టాడు. దీని నుంచి తేరుకున్న సదరు యువతి 100కు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు నిందితుడిని పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పోక్సో కేసులో దోషికి 21 ఏళ్ల జైలు శిక్ష

- 30 వేల జరిమానా
- బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం
- నల్గొండ జిల్లా ఎస్‌సి, ఎస్‌టి కోర్టు సంచలన తీర్పు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పోక్సో కేసులో దోషిగా తేలిన వ్యక్తికి 21 ఏళ్ల కారాగార శిక్ష, రూ.30 వేల జరిమానా విధిస్తూ గురువారం ఎస్‌సి, ఎస్‌టి నల్లగొండ జిల్లా కోర్టు తీర్పు వెలువరించింది. ఇందుకు సంబంధించి జిల్లా ఎస్‌పి శరత్‌చంద్రపవార్ వివరాలు వెల్లడించారు. 2018లో నార్కట్‌పల్లి మండలానికి చెందిన వాడపల్లి వెంకన్నకు, కట్టంగూర్ మండలానికి చెందిన ఓ బాలికకు పరిచ యం ఏర్పడింది. ఆమెను పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి గర్భవతిని చేశాడు. ఆ తర్వాత పెళ్లికి నిరాకరించడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కట్టంగూర్ పోలీస్ స్టేషన్‌లో 2018 ఏప్రిల్ 20న కేసు నమోదైంది. నిందితునిపై పోక్సో కేసులు నమోదు చేసిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అప్పటి నుంచి విచారణలో ఉన్న కేసులో గురువారం నిందితునికి 21 ఏళ్ళ జైలు, రూ.30వేల జరిమానా, బాధితురాలికి రూ.10లక్షల పరిహారం త్వరితగతిన చెల్లింపు చేయాలని డిస్ట్రిక్ లీగల్ సర్వీస్ అథారిటీ (డిఎల్ఎస్ఎ) ఆదేశించింది. ఈ కేసులో సరైన ఆధారాలు సేకరించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసి.. నిందితునికి శిక్ష పడే విధంగా కృషి చేసిన అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్స్, ఎస్ఐ బి రంజిత్, సిఐ క్యాస్ట్రో, ప్రస్తుతం శాలిగౌరారం సిఐగా ఉన్న కొండల్ రెడ్డి, కట్టంగూర్ ఎస్ఐ రవీందర్, పిఎఫ్ వేముల రంజిత్‌కుమార్, సిడిఒ రువ్వా నాగరాజు, భరోసా లీగల్ ఆఫీసర్ కల్పన, లైజన్ అధికారులు, పి నరేందర్, ఎన్ మల్లికార్జున్‌ను ఎస్‌పి అభినందించారు.

డాక్టర్ రెడ్డీస్‌లోని మల్లాది శ్రీకాంత్‌కు డాక్టరేట్



హైదరాబాద్ : నగరంలోని డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ లిమిటెడ్ కార్పొరేట్ కార్యాలయంలో లీడ్ ఎంప్లాయీ రిలేషన్స్ అండ్ ఇండస్ట్రియల్ రిలేషన్స్‌గా పనిచేస్తున్న మల్లాది శ్రీకాంత్‌కు ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. గత 31 సంవత్సరాలుగా డాక్టర్ రెడ్డీస్‌లో పనిచేస్తున్న శ్రీకాంత్, విశాఖ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంహెచ్‌ఆర్ఎం పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో పరిశోధకుడిగా చేరారు. ప్రొఫెసర్ పుట్టపల్లి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో 'ఉద్యోగి జీవిత చక్ర నిర్వహణ మరియు సంస్థ పనితీరుపై దాని ప్రభావం (ఎంప్లాయి లైఫ్ సైకిల్ మేనేజ్‌మెంట్ అండ్ ఇట్స్ ఇంపాక్ట్ ఆన్ ఆర్గనైజేషన్ పర్ఫామెన్స్)'పై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.పి. రాజశేఖర్ చేతుల మీదుగా డాక్టరేట్ సర్టిఫికెట్ అందుకున్నారు.